VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

మంగళవారం 02 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.239




జ్ఞానవాపీ ప్రాంగణంలో పూజలు చేసుకోవచ్చు
హిందూ పూజల కొనసాగింపునకు సుప్రీం అనుమతి

# కెసిఆర్ ప్రజల్లోకి రాగానే కాళేశ్వరం నీరు వదిలారు





**ఇన్నాళ్లూ విమర్శలు చేస్తూ కాలయాపన చేశారు**

**ముందే మేల్కొనివుంటే పంటలు కాపాడుకునే వారు**

**నల్లగొండలో కెసిఆర్ పర్యటనల తరవాత ప్రజల్లో పునరాలోచన**

**రేవంత్‌కు నల్లగొండ, ఖమ్మం నేతలతోనే ముప్పు**

**పార్లమెంటరీ స్థాయి సమీక్షలో కెటిఆర్ విమర్శలు**

**నల్లగొండ:** కాళేశ్వరంపై అవాకులు చవాకులు పేలిన వారే..కెసిఆర్ రైతల బాట పట్టడంతో నీళ్లు విడుదల చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విమర్శించిన కాళేశ్వరమే నీళ్లు అందిస్తున్నదని అర్థం అయ్యిందన్నారు. ఈ పని ముందే చేసివుంటే రైతుల పంటలు కాపాడుకునే వారిమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారని.. నీ పక్కనే ఉన్న ఖమ్మం, నల్లగొండ బాంబులతోనే నీకు ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీతో రేవంత్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ ఐదేండ్లు ఆయనే పాలించి, హామీలు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన
నల్లగొండ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నప్పటికీ రుణమాఫీ చేయలేదు. రైతుబంధు ఇవ్వలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం పై గ్రామాల్లో రైతులు కుతకుత ఉడుకుతున్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటడు. చెప్పుతో కొట్టమన్న ఆయన అహంకారానికి ఓటు అనే ఆయుధంతో వేటు వేయండి. రైతుబంధు దుబారా అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటుండు. అహంకారంగా మాట్లాడే ఈ జిల్లా నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే, రూ. 15 వేల రైతుబంధు ఇవ్వాలంటే, వరి ధాన్యానికి బోనస్ రూ. 500 ఇవ్వాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తాము ఏవీ అమలు చేయకున్నా.. మళ్లీ మాకే ఓటేశారని తప్పించుకు తిరుగుతారు. సీఎం రేవంత్ జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నా అంటుండు. తనకు తెలిసి జేబు దొంగలు తిరుగుతారు ముఖ్యమంత్రులు తిరుగరని కేటీఆర్ తెలిపారు. పేగులు కట్ చేసి మెడలో వేసుకుంటా అంటుండు. అది ముఖ్యమంత్రి చేసే పనా.. అది బోటి కొట్టేడు చేసే పని. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయకున్నా.. ఇక్కడ ఖాళీ బిందెలు ఉన్నాయి. అయినా లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు.. అని కేటీఆర్ ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి నితిన్ గడ్కరీ వద్ద నేనొస్తా నేనొస్తా అని అంటున్నారట. రుణమాఫీ చేయ్. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 2500 ఇస్తానని చెప్పావు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తా అన్నావు.. దాని కోసం రైతలు ఎదురు చూస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్ల మీద పడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 10 వేలు ఇచ్చి ఆదుకోవాలి. దమ్మంటే ఈ పనులు చేసి చూపించు అని కేటీఆర్ సవాల్ చేశారు. పొంకనాల పోతిరెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయారు. నిజం నిలకడ మీదనే తెలుస్తుంది. ఇదే తెలంగాణ ప్రజలు ప్రేమతో, దయతో పదేండ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. ఇక బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ దాకా మాట్లాడారు. ఇవాళ రాహుల్ మాట్లాడుతూ.. మోదీ దొంగ అంటడు. రేవంత రెడ్డేమో మోదీ మా పెద్దన్న అని అంటుండు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటుంటే.. అదానీ మా ఫ్రెండ్ అని రేవంత్ అంటుండు. లిక్కర్ స్కాం లేదు.. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అన్యాయం అని రాహుల్ అంటుండు. లిక్కర్ స్కాం నిజమే. కవిత అరెస్టు కరెక్ట్ అని రేవంత్ అంటుండు. గుజరాత్ ఓ ఫేక్ మోడల్ అని రాహుల్ అంటడు.. తెలంగాణను గుజరాత్ మోడల్‌లా చేస్తా అని రేవంత్ అంటున్నాడు. రేవంత్ రాహుల్ కోసమా, మోదీ కోసమా పని చేసేది. ఒక్క ఓటు కాంగ్రెస్‌కు వేసినా అది బీజేపీకి పోతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇదే రేవంత్.. షెల్టర్, భవిష్యత్, కేసుల నుంచి బయటపడటం కోసం బీజేపీలో చేరుతారు.



## ముమ్మరంగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు

రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

**హైదరాబాద్:** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ4 గా ఉన్న మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే భవ్య సిమెంట్ ఓనర్ ఆనంద్ ప్రసాద్ నుంచి రూ. 70 లక్షలు సీజ్ చేశామని రాధాకిషన్ రావు వెల్లడించారు. అటు దుబ్బాక ఎన్నికల సమయంలో రఘునందన్ రావు, ఆయన బంధువుల నుంచి రూ. కోటి సీజ్ చేశామని ఆయన తెలిపారు. ఇక మునుగోడు బై పోల్ సమయంలో కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి అనుచరుల వద్ద రూ. 3.50 కోట్లు సీజ్ చేసినట్లు రాధాకిషన్ రావు స్టేట్మెంట్ ఇచ్చారు. ప్రణీత్‌రావు సమాచారం ఇవ్వడంతోనే నగదు సీజ్ చేసినట్లు రాధాకిషన్ రావు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు చేసింది.ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు తాము సార్వత్రిక ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు సాధిస్తామని పదేపదే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాషాయ నేతలపై రాహుల్ గాంధీ సంచలన విమర్శలు చేశారు. మ్యాచ్ ఫిక్సింగ్ జరగకుండా బీజేపీ 400 ఎంపీ స్థానాలు గెలవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ఫిర్యాదులతో ఇబ్బంది పెట్టాలని చూసే బీజేపీకి తాజా వ్యాఖ్యలు సాకుగా దొరికాయి. రాహుల్ కామెంట్స్ కు కాషాయ నేతలు కొత్త అర్థాలు వెతికారు. కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి నేతృత్వంలోని బీజేపీ బృందం ఈసీకి ఫిర్యాదు చేసింది. ఎన్నికల సంఘంలో కేంద్రం తన వాళ్లను పెట్టిందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారని హర్దీప్ సింగ్ పురి అన్నారు. ఈవీఎంల పనితీరుపై సందేహాలు లేవనెత్తారని.. సార్వత్రిక ఎన్నికల తర్వాత రాజ్యాంగాన్ని మార్చేస్తామని ఆరోపించారని తెలిపారు. ఈ వ్యాఖ్యలపైనే ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు.ఢిల్లీ రామ్ లీలా మైదానంలో నిర్వహించిన ఇండియా బ్లాక్ లోక్ తంత్ర బచావో ర్యాలీలో రాహుల్ గాంధీ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఐపీఎల్ మ్యాచ్ లు జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. అంపైర్లపై ఒత్తిడి తెచ్చి.. ప్లేయర్లను కొనేసి, కెప్టెన్స్ ను బెదిరించి మ్యాచ్ ల్లో విజయం సాధించవచ్చు. ఇలా చేస్తే మ్యాచ్ ఫిక్సింగ్ అంటారు.త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు అంపైర్లను ప్రధాని మోదీ ఎంపిక చేశారని రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికలకు ముందే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. మ్యాచ్ ఫిక్సింగ్, ఈవీఎంలు, సోషల్ మీడియా, మీడియాపై ఒత్తిడి లేకుండా బీజేపీ 180 కంటే ఎక్కువ స్థానాలు గెలవడం సాధ్యంకాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపైనే బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

# కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

పదేళ్లు సిఎంగా చేసిన వ్యక్తి చేసే వ్యాఖ్యలేనా

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఎలా మాట్లాడుతారు

అప్పలకుప్పగా మార్చి అభివృద్ధి అంటే నమ్మాలా

యాదాద్రి పవర్ ప్లాంట్ అంగీకారం కాకున్నా నిర్మాణమా

కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ భట్టి విక్రమార్క

పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా?అని ప్రశ్నించారు. కట్టుకథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నించారని మండిపడ్డారు. మైక్ సమస్య వస్తే..కరెంట్ కోతలు అంటూ అబద్దాలు మాట్లాడారని చెప్పారు.




# రూ.71,300..

## రికార్డు స్థాయికి 10 గ్రాముల బంగారం ధర

బంగారం ధర అనూహ్యంగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం సోమవారం రూ.71,300కు చేరింది.



హైదరాబాద్: బంగారం ధర అనూహ్యంగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం సోమవారం రూ.71,300కు చేరింది. 22 క్యారెట్ల ఆర్నమెంట్ బంగారం ధర రూ.64 వేలకు పైగా ఉంది. శనివారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.70,300 ఉండేది. పుత్తడి ధర ఇంకా ఎంతకు చేరుతుందో నిపుణులు సైతం అంచనా వేయలేకపోతున్నారు. ఈ ఏడాదిలో వడ్డీరేట్లు తగ్గిస్తామని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రకటించడం, రూపాయితో పోలిస్తే డాలర్ మారకపు విలువ బాగా పెరగడంతో, ఇటీవల కాలంలో బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి.

## దంచికొడుతున్న ఎండలు 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల గరిష్టానికి చేరుకున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ఉదయం నుంచే ఉక్కపోత మొదలవుతున్నది. పొద్దున 9 గంటలకే భానుడు భగభమంటున్నాడు.




## మార్చిలో జీఎస్టీ వసూళ్లలో రికార్డు

రూ. 1.78 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు




**న్యూఢిల్లీ:** దేశంలో మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన వస్తు సేవల పన్నురికార్డు వసూళ్లతో దూసుకుపోతోంది. వ్యాట్ స్థానంలో తీసుకురాబడిన జీఎస్టీ ఊహించిన దానికంటే మెరుగైన పనితీరును కనబరుస్తోంది. మార్చిలో రూ. 1.78 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం వెల్లడించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 11.5 శాతం ఎక్కువ. ఇది ఇప్పటి వరకు రెండవ అత్యధిక వసూళ్లు కావటం గమనార్హం. గరిష్టంగా ఫిబ్రవరిలో 12.5 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీలో వృద్ధి (17.6%) నమోదు కావడం వల్ల కలెక్షన్లు పెరిగాయని కేంద్రం తెలిపింది. ఇదే క్రమంలో జీఎస్టీ రీఫండ్స్ రూ.1.65 లక్షల కోట్లుగా నిలిచాయి. FY24లో జీఎస్టీ కలెక్షన్లు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 11.7% పెరిగి రూ.20.14లక్షల కోట్లు వచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సగటు నెలవారీ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లుగా నిలిచాయి. మునుపటి సంవత్సరం సగటు జీఎస్టీ వసూళ్లు రూ.1.5 లక్షల కోట్లను అధిగమించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి నాటికి తిరిగి చెల్లింపుల GST రాబడి నికర రూ.18.01 లక్షల కోట్లు, ఇది గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 13.4% వృద్ధి.

## జ్ఞానవాపీ ప్రాంగణంలో పూజలు చేసుకోవచ్చు
## హిందూ పూజల కొనసాగింపునకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ:** వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలోని దక్షిణ సెల్లార్‌లో హిందువులు నిర్వహిస్తున్న పూజలను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. జ్ఞానవాపి ప్రాంగణంలో హిందువులు, ముస్లింలు చేసే పూజలపై స్టేటస్ కో ఉంచాలని కోర్టు ఆదేశించింది. జ్ఞానవాపి మసీదు కమిటీ పిటిషన్‌పై ఏప్రిల్ 30లోగా కాశీ విశ్వనాథ ఆలయ ధర్మకర్తలు సమాధానం ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కోరింది. జ్ఞానవాపి ప్రాంగణంలోని దక్షిణ సెల్లార్‌లో పూజకు అనుమతిని వ్యతిరేకిస్తూ మసీదు కమిటీ చేసిన అభ్యర్థనపై జూలైలో తుది తీర్పు ఇస్తామని స్పష్టం చేసింది. జనవరి 31న వారణాసి కోర్టు జ్ఞానవాపి దక్షిణ సెల్లార్ అయిన 'వ్యాస్ జీ కా తెహ్?నా'లో హిందూ పక్షం ప్రార్థనలు చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిన తర్వాత సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. జనవరి 31 నాటి ఉత్తర్వులను ముస్లిం పక్షం సవాలు చేయడంతో ఫిబ్రవరిలో అలహాబాద్ హైకోర్టు వారణాసి కోర్టు తీర్పును సమర్థించింది. జ్ఞానవాపి మసీదు దక్షిణ సెల్లార్‌లో హిందువులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించిన వారణాసి కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ముస్లింలు దాఖలు చేసిన ఈ అప్పీల్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది.హిందువులు సెల్లార్‌లో ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతిస్తూ జనవరి 31న వారణాసి కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ మసీదు కమిటీ వేసిన పిటిషన్‌ను ఫిబ్రవరి 26న అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. మసీదు కమిటీ పిటిషన్‌ను కొట్టివేస్తూ, 'వ్యాస్ జీ కా తెహ్?నా' లోపల ఆరాధన ఆచారాలను నిలిపివేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 1993లో తీసుకున్న నిర్ణయం "చట్టవిరుద్ధం" అని హైకోర్టు గమనించింది. అనేక మంది హిందూ కార్యకర్తలు వివాదాస్పద జ్ఞానవాపి మసీదు స్థలంలో గతంలో ఉన్న దేవాలయాన్ని 17వ శతాబ్దంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ఆదేశాల మేరకు కూల్చివేశారని సవాలు చేశారు. కాగా ఈ వాదనను ముస్లింలు తిరస్కరించారు.

## దంచికొడుతున్న ఎండలు 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**నల్లగొండ:** రాబోయే 5 రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతారణ కేంద్రం తెలిపింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాడ్పుల ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొంది. నల్లగొండ జిల్లాలోని శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మరో రెండు రోజుల్లో ఉష్ణో గ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు.

## జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ

**న్యూఢిల్లీ:** జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి గల కారణాలు చెబుతూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని.. విచారణ వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఆదేశించింది.
డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా జాప్యమవుతోందని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు కోర్టుకు తెలిపారు. రాజకీయ కారణాలతో ట్రయల్ ఆలస్యం కాకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ నేత, సీఎం అనే కారణాలతో విచారణలో జాప్యం జరగకూడదని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. బెయిల్ రద్దు, కేసు విచారణ తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది. ఏపీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో ఆయన బెయిల్‌ను రద్దు చేయాలన్న ఎంపీ రఘురామ కృష్ణరాజు వేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జగన్ కేసుల విచారణలో జాప్యంపై కారణాలు తెలపాలని సీబీఐని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రఘురామ పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ నిర్వహించింది. జగన్ కేసుల విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కూడా రఘురామ మరో పిటిషన్ దాఖలు చేశారు. రెండు పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపింది. రెండు పిటిషన్లపై రిప్లైకి సీఎం జగన్ మరింత సమయం కోరారు. తదుపరి విచారణ ఆగస్ట్ 5 కి వాయిదా వేసింది. నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఆదేశించింది. బెయిల్ రద్దు, హైదరాబాద్ నుంచి ట్రయల్ మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 5 నుంచి ప్రారంభం అయ్యే వారానికి వాయిదా వేసింది.

## కడపబరిలో షర్మిల పోటీ ఖాయం
### కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం

న్యూఢిల్లీ: కడప పార్లమెంట్ బరిలో వైఎస్ షర్మిల పోటీ దాదాపు ఖాయమైందని సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో పార్టీ ఏపీలో పోటీ చేయబోయే అభ్యర్థుల విషయమై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతి, నంద్యాల, అనంతపురం, గుంటూరు, విజయవాడ, అమలాపురం, కర్నూల్, అరకు స్థానాలను ఇంకా పార్టీ పెండింగ్‌లోనే పెట్టింది. కమ్యూనిస్టులు, ఇతర ప్రతిపక్షాలకు సీట్ల కేటాయింపు నేపథ్యంలో కొన్ని స్థానాలను ఏపీ కాంగ్రెస్ పార్టీ పెండింగ్‌లో పెట్టింది. షర్మిలనే కడప నుంచి పోటీకి దింపాలని పార్టీ దాదాపుగా నిర్ణయానికి వచ్చిందని తెలుస్తోంది.
రాజమండ్రి పార్లమెంట్ బరిలో గిడుగు రుద్రరాజు, బాపట్ల నుంచి జేడీ శీలం పోటీ చేయనున్నారు. అయితే సీనియర్ నేత రఘువీరా రెడ్డి మాత్రం ఈసారి ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండనున్నారు. మాజీ ఎంపీ పల్లంరాజును కాంగ్రెస్ అధిష్టానం కాకినాడ నుంచి బరిలోకి దింపనుంది. ఏపీలో 117 అసెంబ్లీ,17 లోక్ సభ స్థానాలపై సీఈసీలో చర్చ జరిగింది. వీటిలో 58 అసెంబ్లీ, 8 లోక్ సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ పెండింగ్ పెట్టింది. నంద్యాల, తిరుపతి,అనంతపురం, కర్నూలు, విజయవాడ, అరకు, గుంటూరు, అమలాపురం లోక్ సభ స్థానాలను పెండింగ్‌లో ఉంచింది. ఇక రాజమండ్రి నుంచి గిడుగురుద్ర రాజు బరిలోకి దిగనున్నారు. కడప లోక్ సభ నుంచి వైఎస్ షర్మిల.. విశాఖపట్నం నుంచి సత్యా రెడ్డి.. కాకినాడ నుంచి న్న పల్లం రాజు లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండనున్నారు. బాపట్ల నుంచి మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం పోటీ చేయనున్నారు. వీటన్నింటిలోకి కడప స్థానమే హాట్ టాపిక్ కానుంది. ఇప్పటికే షర్మిల కడప నుంచి పోటీ చేస్తారంటూ వార్తలైతే వచ్చాయి కానీ అధికారిక ప్రకటన రాకపోవడంతో ఆ వార్తలకు అంత ప్రాధాన్యత ఏర్పడలేదు. ఇప్పుడు అధికారికంగా తెలియడంతో హాట్ టాపిక్ అయిపోయింది. కడప అంటే సీఎం జగన్ సొంత ఇలాఖా.. అక్కడి నుంచి గత ఎన్నికల్లో ఆయన సోదరుడు వైఎస్ అవినాష్ రెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. ఈసారి కూడా ఆయనే బరిలోకి దిగనున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగన్ స్వయానా సోదరి వైఎస్ షర్మిల బరిలోకి దిగనుండటంతో కడప ప్రజలు ఎవరికి మద్దతుగా నిలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

## అధికారంలోకి వచ్చేది టిడిపి కూటమి
## విజయవాడ ప్రచారంలో కేశినేని చిన్న

**విజయవాడ:** తూర్పు నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని హామీ ఇచ్చారు. రాబోయేది టిడిపి ఉమ్మడి కూటమి ప్రభుత్వమేనని అన్నారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం గుణదలలో కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్ పర్యటించారు. అమ్మ కళ్యాణ మండపం వద్ద కేశినేని చిన్నికి, గ్దదె రామమోహన్‌కు స్థానికులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ.. వచ్చేది టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వమే ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా రానున్న రోజుల్లో పాలన ఉండబోతుందన్నారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రణాళికాబద్ధంగా, నిర్ణీత కాల వ్యవధిలో అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. విజయవాడ పార్లమెంట్‌లో ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని కేశినేని చిన్ని పేర్కొన్నారు.



# కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు

**న్యూఢిల్లీ:** పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన కెసిఆర్ అర్థంపర్థం లేకుండా దిగజారి మాట్లాడుతున్నారని సూర్యాపేటలో భారాస అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శలు చేశారు. భారాస నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆయన తట్టుకోలే పోతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటల్లో కొంచెమైనా వాస్తవాలు లేవన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా?అని ప్రశ్నించారు. కట్టుకథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నించారని మండిపడ్డారు. మైక్ సమస్య వస్తే..కరెంట్ కోతలు అంటూ అబద్దాలు మాట్లాడారని చెప్పారు. బొగ్గు లభించే ప్రాంతానికి 350 కి.మీ. దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారని దుయ్యబట్టారు. దూరంగా ఉండటం వల్ల థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కోసం భారీగా ఖర్చువుతోంది. పర్యావరణ అనుమతులు పొందటంలో ఆలస్యం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తెలంగాణకు 4 వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉంది. విభజన చట్టం ప్రకారమే రాష్ట్రానికి ఎన్టీపీసీ మంజూరయ్యింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి ఎ÷-లాంట్ నిర్మించాల్సి ఉంది. కానీ, కమిషన్ల కోసం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి పవన్ ప్లాంట్ చేపట్టారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నమోదైంది. సరఫరా లేకుంటే ఇంత వినియోగం ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఏప్రిల్, మే నెలలోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. దేశమంతా గ్రిడ్ అనుసంధానం 2013లోనే యూపీఏ ప్రభుత్వం చేసింది. పదేళ్లలో పాలనలో కేసీఆర్ ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలి. అందరికీ రెండు పడకగదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారా?ప్రతి మండలంలో బాలబాలికలకు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, ప్రతి నియోజకవర్గంలో కేజీ టూ పీజీ విద్యాలయాలు నిర్మించారా? దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? రైతులకు రుణమాఫీ ఐదేళ్లలో పూర్తి



చేశారా? వర్షాకాలంలో అధికారంలో ఉన్నది ఎవరు? వాననీటిని రిజర్వాయర్లలో నింపే పరిస్థితి లేకుండా చేసిందెవరు? ప్రపంచంలోనే అత్యద్భుతం అని చెప్పిన కాళేశ్వరం కుంగిపోయింది. అన్ని లెక్కలతో చర్చకు రావడానికి నేను సిద్ధం అని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. అంతేగాకుండా తెలంగాణ ప్రజలపై మాజీ సీఎం కేసీఆర్ మోయలేని భారం మోపారని భట్టివిక్రమార్క అన్నారు. కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలేనని అన్నారు. ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలను కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు వేల మెగావాట్ల పవర్ తెలంగాణకు ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉందని చెప్పారు. 2400 మెగావాట్ల పీపీఏ అగ్రిమెంట్లు చేసుకోకుండా కేసీఆర్ కుట్ర చేశారని మండిపడ్డారు. ఆయన పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు లాభం కోసం కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీపీసీ వల్ల కరెంట్ యూనిట్‌కు 9 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆ సంస్థకు లక్ష పదివేల కోట్ల రూపాయలను గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనకు వస్తున్నామని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. కేసీఆర్ లాగా ప్రధానమంత్రి కలవడానికి పది రోజులు ఇక్కడే ఉండి కుట్రలు చేయలేదన్నారు. తాము ఇతరులతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కాల్వల్లోకి కేసీఆర్ నీరు వదిలారన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని, కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. 2019 లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే మొదటి నెల ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని... తాము వచ్చిన తర్వాత ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామని చెప్పారు. రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను పెడితే అవి కూడా ఇచ్చుకుంటూ వచ్చామన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చామని చెప్పారు. 5 ఏళ్లలో మహిళలకు వడ్డీలేని లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. పంట నష్టం జరిగిన వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చాకే వర్షాలు రావడం లేదని కేసీఆర్ అంటున్నారని... జూన్‌లో ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న దగ్గరి నుంచే వర్షాలు రావట్లేదన్నారు. రిజర్వాయర్‌లో ఎక్కడ నీళ్లు లేకున్నా అది కేసీఆర్ పుణ్యమేనని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో నీళ్లు లేకుండా కేసీఆర్ చేశారని భట్టివిక్రమార్క మండిపడ్డారు.

# మోడీ ఫోటో పెట్టుకుంటే గెలవలేరు

**అందుకే రామజపం చేస్తున్న బిజెపి**

**కరీంనగర్ అభివృద్ధికి బండి చేసిందేమీ లేదు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు**



**సిద్దిపేట:** పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రధాని మోదీ ఫొటోతో గెలిచే పరిస్థితిలో లేరని..అందుకనే అయోధ్య రాముడి ఫొటోతో ప్రచారం చేసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రామజపం చేస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాముడు అందరివాడన్నారు. 5 ఏళ్లలో కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ఎంపీ బండి సంజయ్ ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. తాను జిల్లాను ఎలా చేశానో ప్రజల అందరికీ తెలుసునని చెప్పారు. సోమవారం నాడు కోహెడ మండలంలోని శనిగరం పెద్ద చెరువును ఆకస్మికంగా సందర్శించారు. శనిగరం గ్రామంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని , అక్కడ అవసరమైన బోర్ వేల్స్ వేసుకోవడంతో పాటు అదనపు మోటార్లు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ సెక్రెటరీతో పాటు స్పెషల్ ఆఫీసర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాలల్లో తరగతి గదులకు కలర్స్ వేయడంతో పాటు టాయిలెట్స్ నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎండాకాలంలో ఈసారి ముందుగానే భూగర్భ జలాలు పడిపోయాయన్నారు. కాంగ్రెస్ (అనీనిణసఃబబ) కరువు తెచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటున్నారని.. కానీ బీఆర్ఎస్ తెచ్చిన కరువు ఇదని ఎద్దేవా చేశారు. గ్రామానికి , మండలానికి, నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలకు ఏ సమస్య వచ్చిన తాను 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ప్రతి గ్రామగ్రామాన పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కొంతమంది భూ పంచాయతీలల్లో తనను ఇన్వాల్వ్ చేస్తున్నారని.. వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు.

# ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్

**పంటల బీమా అమలు చేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ**

**అబద్దాలతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లిన కెసిఆర్**

**కరువు వచ్చిందే బిఆర్ఎస్ పాలనలోనే అన్న ఉత్తమ్**

**హైదరాబాద్:** కెసిఆర్ హయాంలో ఇరిగేషన్ రంగం సర్వనాశనం అయ్యిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ రంగంలో కేసీఆర్ చేసిన దోపిడీ దేశంలో ఎవరూ చేయలేదన్నారు. జనగామ, సూర్యపేట జిల్లాలో కేసీఆర్ పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న కేసీఆర్ అన్ని అబద్ధాలే మాట్లాడారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్థవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు పంట బీమా కల్పించలేదని.. .దేశంలో పంట బీమా కల్పించని ఏకైక సర్కార్ బీఆర్ఎస్ దేనని విమర్శించారు. వరదలు, కరువుతో పంట నష్టపోతే.. ఒకటి రెండు చోట్లకు వెళ్లి కేసీఆర్ డ్రామా చేశాడని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. మైక్ పనిచేయకుంటే కరెంట్ పోయిందంటూ కేసీఆర్ అబద్దాలు మాట్లాడారని.. పవర్ విషయంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. 24 గంటల పవర్ పాలసీని కొనసాగిస్తున్నాం.. రాష్ట్రంలో పవర్ కట్స్ లేవని స్పష్టం చేశారు.కాళేశ్వరం గురించి మాట్లాడటానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. తలదించుకోవాలి.. ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందే కేసీఆర్ అని నిప్పులు చెరిగారు. కేసీఆర్, జగన్ దోస్తీతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. కృష్ణా నుంచి జగన్ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా కేసీఆర్ నోరు మెదపలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఏపీకి ఎక్కువ నీళ్లు తరలి వెళ్లాయన్నారు. కేసీఆర్ భయాందోళనలో ఉన్నాడు.. అందుకే పొలం బాట పట్టారని చెప్పారు. కేసీఆర్ పొంకనాలకు పోయి పార్టీని నాశనం చేశాడని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలోనే కుప్పకూలిందని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో



బీఆర్ఎస్ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇన్ని మాటలు మాట్లాడుతున్న కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు పంట బీమా ఎందుకు కల్పించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగారు. దేశంలో పంట బీమా కల్పించని ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్సేనని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బిఆర్ఎస్ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. 24 గంటల పవర్ పాలసీ కొనసాగిస్తున్నామని, నిమిషం పవర్ కట్స్ ఎక్కడా లేవన్నారు. తెలంగాణ రైతాంగం, ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసి వ్యక్తి కెసిఆర్ అని, అందుకు ఆయన సిగ్గుపడాలి, తలదించుకోవాలి, తెలంగాణ జనాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రంగాన్ని కెసిఆర్ నాశనం చేయడంతో పాటు దోపిడీ చేశారని ఆరోపణలు చేశారు.

# కాంగ్రెస్ అబద్ధ ప్రచారాలను నమ్మి మోసపోయారు.

**- ఆశీర్వదించండి సేవకుడిగా పనిచేస్తా. బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్1**




అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధ ప్రచారాలను నమ్మి ప్రజలు మోసపోయారని, పార్లమెంట్ ఎన్నికల్లో మరో సారి మోసపోవద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.
సోమవారం నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో అర్బన్ నియోజకవర్గంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ, తనను ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తానని అన్నారు. పార్లమెంట్ సమావేశాలు నడిచినప్పుడు ఢిల్లీకి.. మిగతా రోజులు నిజామాబాద్ జిల్లా ప్రజల వద్దనే ఉంటానని అన్నారు. అసెంబ్లీ ఎలక్షన్లో ప్రజలు దురాశ కు పోయి దుఃఖాన్ని తెచ్చుకున్నారని, కాంగ్రెస్ అబద్ధ ప్రచారాలను నమ్మి మోసపోయారన్నారు. కళ్యాణ లక్ష్మి తులం బంగారం ఇస్తాను అని హామీ ఇచ్చారని అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో 200 ఉన్న పింఛన్ ని రెండు 2000 వేల కు పెంచిన ఘనత కేసీఆర్ దేనని గుర్తు చేశారు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఎక్కడ... మూడు పంటలకు ఇస్తానన్న రైతుబంధు ఎక్కడ... 24 గంటల కరెంటు ఎక్కడ... రెండు లక్షల రుణమాఫీ ఎక్కడ... కాంగ్రెస్ పార్టీ 420 హామీలు.. ప్రజలకు అబద్ధం చెప్పి.. అధికారం ఎక్కారు.. ప్రజలను అరిగోస పెడుతున్నారని అన్నారు. వడ్లకు అదనంగా 500 బోనస్ ఇచ్చి వడ్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు ఇంతవరకు లేదు.. రైతులకు కరెంటు లేక బోరుబావులు ఎండిపోయి పంటలు ఎండిపోయి రైతన్నలు హరిగోస పడుతున్నారని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఎంపీ నిజామాబాద్ కు చేసింది శూన్యం అని, ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఐదు సంవత్సరాలు గడిచిపోయింది ఇంకా రాలేదు.. ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు ప్రజలు నిలదీయండి అని పిలుపునిచ్చారు. పనిచేసే ముఖం లేదు సోషల్ మీడియాలో అబద్ధ ప్రచారాలు చేసుకుంటూ కాలమెల్ల తీయడం తప్ప ప్రజలకు చేసింది శూన్యం అన్నారు. కావున రాబోయే ఎన్నికల్లో ఎంపీ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్తారని ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా, జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్ రావు, నగర మేయర్ నీతూ కిరణ్, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఏఐటీయూసీ పోరాట ఫలితమే పెండింగ్ వేతనాలు చెల్లింపు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 1:** తమ పోరాట ఫలితమే పెండింగ్ వేతనాలు చెల్లింపు జరిగిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు.
ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సోమవారం మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో గత ఎనిమిది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన వేతనాలు రిలీజ్ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ సందర్భంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటో తేదీ నుండి నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్ను రిలీజ్ చేస్తూ జీవో విడుదల చేసిన నేపథ్యంలో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఏఐటీయూసీ పోరాటానికి పాత బడ్జెట్ రిలీజ్ చేయడమే కాకుండా జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడానికి ఆదేశాలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి. నర్సింగరావు మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

**ఇస్లాంగర్:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇస్లాంగర్ పట్టణంలోని బాణాసంచా గోదాములో పేలుడు సంభవించింది. దీంతో రెండంతస్తుల ఇల్లు కుప్పకూలింది. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో భర్త, భార్య, ఇద్దరు పిల్లలు సహా ఐదుగురు ఉన్నారు. వారంతా శిథిలాల కింద కూరుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు రెస్క్యూ టీమ్ సహాయంతో అక్కడికి చేరుకుని శిథిలాల నుంచి భర్త, బిడ్డను సురక్షితంగా బయటకు తీయగా, భార్య, చిన్నారి సహా ముగ్గురు వ్యక్తులు శిథిలాల కిందే చిక్కుకుపోయారు. అయితే.. వారిని రక్షించేందుకు శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇస్లాంనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొహాలీ పట్టణంలో ఈ ప్రమాదం జరిగింది. పట్టణానికి చెందిన అక్తర్ తన ఇంటి మొదటి అంతస్తులో పటాకుల గోదాం పెట్టాడు. కుటుంబం మొత్తం రెండో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం పటాకుల గోదాములో ఒక్కసారిగా
పేలుడు సంభవించడంతో.. రెండంతస్తుల ఇల్లు కూలిపోయింది. పేలుడు శబ్దం విన్న చుట్టుపక్కల వారు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీమ్‌ను పిలిపించారు. సంఘటనా స్థలంలో రెస్క్యూ ప్రారంభించిన తర్వాత, అక్తర్ మరియు అతని పిల్లలలో ఒకరిని సురక్షితంగా బయటకు తీశారు. అతని భార్య మరియు ఒక బిడ్డతో సహా ముగ్గురు వ్యక్తులు ఇప్పటికీ శిథిలాల కింద చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు రెస్క్యూ టీమ్ ప్రయత్నిస్తోంది.

# కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి ఒకే తాను ముక్కలే.

**- బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్.**

**వేగుచుక్క న్యూస్, మద్నూర్, ఏప్రిల్1**



ప్రజలను మాయ మాటలతో మోసం చేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి పార్టీలన్నీ ఒకటేనని, అవన్నీ ఒకే తాను ముక్కలేనని బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. సోమవారం మద్నూర్ మండల కేంద్రంలో బహుజన లెఫ్ట్ పార్టీ–బిఎల్ పి జుక్కల్ నియోజకవర్గం ఇన్చార్జి కర్రేవార్ నగేష్ అధ్యక్షతన జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి వడ్ల సాయి కృష్ణ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్–బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ మాట్లాడుతూ, తెలంగాణ సమాజంలో నూటికి తొంభై మూడు శాతం బహుజన ప్రజలుంటే కేవలం ఏడు శాతం ఉన్న ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీలైన బిజెపి కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు పాలనలో బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదలైన బహుజనులు అన్ని రకాల దోపిడికి గురవుతున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ చరిత్రలో ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు జోక్యంతో బయటపడ్డ ఎలెక్టోరల్ బాండ్ ల కుంభకోణంలో వామపక్ష పార్టీలు తప్ప అన్ని ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీలు భాగస్వామ్య ఉన్న విషయం తెలిసిందేన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఓటు ఆయుధంతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బహుజన లెఫ్ట్ పార్టీ–బిఎల్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ధిరాములు మాట్లాడుతూ, పాలక వర్గాలన్ని కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని, కార్మిక దోపిడి పార్టీలను ఓడించి బహుజన వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ, బీజేపీ కేంద్రంలో అధికారంలో వచ్చిన తరువాత బహుజన మహిళలపై రోజురోజుకూ హత్యలు, అత్యాచారాలు లైంగిక వేధింపులు పెరిగిపోయానని విమర్శించారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి వడ్ల సాయి కృష్ణ మాట్లాడుతూ, జహీరాబాద్ పార్లమెంట్ నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ , బిజెపి, బీఆర్ఎస్ అభ్యర్థులు ముఖ్యంగా కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు గత 20 సంవత్సరాలుగా ప్రజల మౌళిక సదుపాయాల కల్పన కోసం ఎలాంటి కృషి చేయలేదని వారి ఆస్తుల పెంచుకోవడానికే పార్లమెంట్ పదవిని వాడుకున్నారని విమర్శించారు. మద్యం డబ్బులు పెంచకుండా గెలవాలని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ పి, జుక్కల్ నియోజకవర్గం నాయకులు, సాయిలు, శాంతమ్మ, జనాకి బాయ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు,

## రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లో అగ్నిప్రమాదం

**పత్తి ప్యాకింగ్ గోడౌన్‌లో చెలరేగిన మంటలు**

హైదరాబాద్,: రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ లోనూ అగ్నిప్రమాదం జరిగింది. అత్తాపూర్‌లోని పత్తి ప్యాకింగ్ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో అందులో పనిచేస్తున్నవారు భయంతో బయటకు పరుగులు తీశారు. పత్తిని మంటలు అంటుకుని మంటలు భారీగా చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందిని సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో భారీగా ఆస్థినష్టం జరిగినట్లు వెల్లడించారు. అయితే షార్ట్ సర్క్యూట్ తోనే మంటలు చలరేగాయని అనుమానం వ్యక్తం చేన్నారు. ఈ ప్రమాదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇక మరోవైపు హైదరాబాద్ పాతబస్తీలో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి చార్మినార్ సమీపంలోని యునాని ఆస్పత్రిలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో దుకాణదారులు, ప్రజలు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.

# నలంద"కు ఓలంపియాడ్, ఐఐటీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు.






**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఏప్రిల్1:**

పట్టణంలోని నలంద ఐఐటీ స్కూల్ 2023–24 విద్యా సంవత్సరంలో ఈ - అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన ఆర్ఎస్ఎమ్, ఆర్ఎంఎం, కె సాట్, బివివిఎస్, కెసిసిఎం, ఏ మ్యాట్, బి మ్యాట్ ఐఐటీలో రాష్ట్రస్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు సుమారు 454 స్కూల్స్ నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన పరీక్షల్లో నలంద విద్యార్థులు మొదటి 1,2 ,3 ర్యాంకులను కైవసం చేసుకోవడం పాఠశాలకు గర్వకారణం అని యాజమాన్యం ప్రసాద్, సాగర్ తెలిపారు. వర్షిత్ (1), సహస్ర(1), విష్ణుప్రియ (1), హనీరెడ్డి (1), ప్రీతిరెడ్డి (1), భావన రెడ్డి(1), హృదయశ్రీ((1), ప్రాచీ (1), పావని (2), చతుర్యా(2), బాలాజీ ((2), అభినయ్(2), నిత్యా శ్రీ (2), కీర్తిరెడ్డి(2), స్వెజన్ (2), మాధవ సాయి (3), స్ఫూర్తి(3), వెంకట లక్ష్మీ ((3), యువరాజ్ (3), హరిని (3), సిందుష (3), హేమశ్రీ(3) విధ్యార్థులు నలంద పాఠశాల ను అగ్రగామి స్థాయిలో నిలబెట్టారు. ఇలాగే మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని పాఠశాల యాజమాన్య ప్రసాద్,సాగర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులకు భారతీయ విద్య భవన్, హైదరాబాద్ లో ఇస్రో శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యమ్ చేతుల మీదుగా షీల్డ్ బహూకరిచారు.
మంచి ప్రతిభకలిగిన విద్యార్థులను వెనుక ఉండి ప్రోత్సహిస్తూ మార్గదర్శకాలు చేసిన యాజమాన్యాన్ని
ఈ అబ్యాస్ వారు ఘనంగా శాలువా,మేమొంటో తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# కనీసం ఆ ఊరటైనా లభిస్తుందా..?

ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో నేడు వాదనలు జరగనున్నాయి. తన కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. నేడు విచారణ జరగనుంది. దీంతో న్యాయమూర్తి తీర్పుపై ఉత్కంఠ నెలకొని ఉంది.



ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆమెకు జ్యూడీషియల్ రిమాండ్ విధించగా.. ప్రస్తుతం ఆమె తీహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కాగా.. ఈ కేసులో ఆమె దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో నేడు విచారణ జరగనుంది. తన చిన్న కుమారుడికి ఇంటర్ ఎగ్జామ్స్ ఉన్నాయని.. ఈ సమయంలో కుమారుడికి తన అవసరం ఉందని, అందుకే ఏప్రిల్ 16 వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. అదే సమయంలో సాధారణ బెయిల్ పిటిషన్‌పైనా విచారణ చేపట్టాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే లిక్కర్ కేసు విచారణ దశలో ఉందని.. కవితకు బెయిల్ ఇస్తే, సాక్షులను ఆమె ప్రభావితం చేసే అవకాశం ఉందని.. అందుకే బెయిల్ ఇవ్వొద్దని కోర్టుకు ఈడీ విజ్ఞప్తి చేసింది. వాదనలు విన్న న్యాయమూర్తి మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న వాదనలు వింటామని తెలిపారు.

**ఎమ్మెల్సీ కవితను తీహార్ జైలుకు తరలిస్తున్న దృశ్యాలు**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మార్చి 15న హైదరాబాద్‌లో కవితను ఈడీ అరెస్టు చేసింది. మార్చి 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. 10 రోజుల కస్టడీ ఇవ్వాలని ఈడీ కోరగా.. ఏడు రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఆ తర్వాత మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా, మూడురోజులకు అనుమతించింది. చివరగా కవితను మార్చి 26న ఈడీ అధికారులు రెవెన్యూ న్యాయస్థానంలో హాజరు పరిచారు. దీంతో కవితకు ఏప్రిల్ 9వ తేదీ వరకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. జ్యుడీషియల్ రిమాండ్ సందర్భంగా కొన్ని ప్రత్యేక వసతులు కల్పించాలని న్యాయమూర్తిని కవిత విజ్ఞప్తి చేశారు. ఇంటి నుంచి భోజనం, బట్టలు, ఆభరణాలు ధరించడం, సొంతంగా పరుపులు ఏర్పాటు చేసుకోవడం, దుప్పట్లు తెచ్చుకోవడం, చెప్పులు ధరించడం వంటి వెసులుబాట్లు కల్పించాలని కోరాగ.. అందుకు కోర్టు అనుమతిచ్చింది. అయితే జైలు అధికారులు మాత్రం వాటిని అనుమతించటం లేదని కవిత తరఫు న్యాయవాది ఈనెల 28న మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సోమవారం విచారణ సందర్భంగా కవిత తరఫున న్యాయవాదులు ఈ అంశాన్ని మరోసారి కోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు సమాచారం. ఒకవేళ మధ్యంతర బెయిల్ ఇవ్వని పక్షంలో జైల్లో ఆ వసతులైనా కల్పిం చేలా జైలు అధికారులకు ఆదేశాలివ్వాలని కోర్టును కోరే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

# ఎక్కడైనా సరే గద్దలా వచ్చి వాలుతుండే..

## స్మితా సబర్వాల్‌పై కేసీఆర్ ప్రశంసలు



**బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల్లోని నీటిని పంటలకు సద్వినియోగం చేసుకున్నామని, తాగు నీటి సమస్య రాకుండా మిషన్ భగీరథ పథకాన్ని విజయవతంగా అమలు చేశామని చెప్పుకొచ్చిన కేసీఆర్.. ఈ క్రమంలో స్మితా సబర్వాల్ పని తీరు మీద ప్రశంసలు కురిపించారు.**

సీనియర్ ఐఏఎస్ అధికారి, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ స్మితా సబర్వాల్ మీద.. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పనుల్లో ఆమె చూపించిన నిబద్ధతను మీడియా ముఖంగా గుర్తు చేసుకున్నారు. మిషన్ భగీరథ పనులపై నిత్యం మానిటరింగ్ చేస్తుండేవారని.. ఎక్కడ సమస్య వచ్చినా గద్దలా వచ్చి వాలిపోయి.. ఇంజనీర్లతో కలిసి సమీక్ష చేస్తుండేవారంటూ కేసీఆర్ వివరించారు. తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో ఎండిపోయిన పంటల పరిశీలనల్లో భాగంగా.. నల్గొండ, సూర్యాపేట, జనగామ జిల్లాల్లో పర్యటించిన కేసీఆర్.. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో సాగు, తాగు నీటి కొరత, కరెంట్ సమస్యలు, రైతుల ఆత్మహత్యలపై సుదీర్ఘంగా మాట్లాడిన కేసీఆర్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల్లోని నీటిని పంటలకు సద్వినియోగం చేసుకున్నామని, తాగు నీటి సమస్య రాకుండా మిషన్ భగీరథ పథకాన్ని విజయవతంగా అమలు చేశామని చెప్పుకొచ్చిన కేసీఆర్.. ఈ క్రమంలో స్మితా సబర్వాల్ పని తీరు మీద ప్రశంసలు కురిపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న రోజుల్లో బోరుబండ్లు కనమరుగయ్యాయని.. ఇప్పుడు వాటి హోరు వినిపిస్తుందని కేసీఆర్ విమర్శించారు. కరెంట్



మోటర్ల వైడింగ్ వర్క్ జోరుగా నడుస్తోందన్నారు. ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, స్టెబిలైజర్లు మళ్లీ వచ్చాయన్నారు. ఇక.. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథను పట్టించుకున్న నాథుడే లేడని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కింద ఇంటింటికి తాగునీరు అందించే క్రమంలో ఎందుకు సమస్య ఎదురవుతోంది.. నిర్మించింది మీరే నడిపింది మీరే కాదా ఏమైందని పలువురు ఇంజనీర్లను ప్రశ్నిస్తే.. ఇందులో అసలు కిటుకు వేరే ఉందని అసలు విషయం చెప్పారన్నారు. "ఈ పథకం గురించి అడిగేవాళ్లే లేరని.. అప్పుడంటే సపరేట్‌గా మిషన్ భగీరథ సెక్రటరీగా స్మితా సబర్వాల్ ఉండేవారు.. ప్రతి రోజూ దీని మీద మానిటరింగ్ ఉంటుండే.. ఎక్కడైనా కూడా ఆమె గద్దలా వచ్చి వాలి.. అందరు ఇంజనీర్లకు తీసుకొొచ్చి కూర్చోబెట్టి.. టాప్ టూ బాటమ్ సమీక్ష చేస్తుండే.. బ్రహ్మాండంగా జరుగుతుండే.. చిన్న పైపు ముక్క పోయినా తెల్లారేలోపు వేసేవాళ్లు.. ఇయ్యాళ్ల 15 రోజులైనా పట్టించుకునేవాళ్లు లేరు.. అజమాయిషీ కొరవడింది.." అంటూ ఆ ఇంజనీర్లు చెప్పారంటూ గుర్తు చేశారు కేసీఆర్. కాగా.. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు స్మితా సబర్వాల్ సీఎంఓ ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించేవారు. అంతే కాకుండా.. మిషన్ భగీరథకు సెక్రటరీగా ఉంటూ ఆ విభాగానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు చూసుకునేవారు. నిత్యం ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పనులు పర్యవేక్షిస్తూ.. సమీక్షలు చేసే వారు స్మితా సబర్వాల్. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన తర్వాత ఆమెను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా నియమించింది రేవంత్ సర్కార్.

# ఇక నుంచి అయోధ్య వెళ్లటం మరింత ఈజీ..!



తెలంగాణలోని రామ భక్తులకు కేంద్ర ప్రభుత్వం తీయటి కబురు వినిపించింది. రాములోరు నడయాడిన నేల అయోధ్యలో కళ్లు మిరుమిట్లు గోలిపేలా ఆలయాన్ని నిర్మించగా.. దాన్ని సందర్శించేందుకు హైదరాబాద్ నుంచి డైరెక్టు విమాన సర్వీసులను ప్రారంభించనుంది కేంద్రం. అది కూడా ఏప్రిల్ 2 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇన్ని రోజులు రైళ్లు, బస్సుల ద్వారా ఇబ్బంది పడుతూ వెళ్లే భక్తులకు ఇక నుంచి.. బాలరామున్ని దర్శించుకోవటం సులభం కానుంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న శ్రీరాముని భక్తులకు కేంద్రం గుడ్ న్యూస్ వినిపించింది. ఇక నుంచి అయోధ్యకు వెళ్లేందుకు డైరెక్టుగా విమాన సేవలు అందుబా టులోకి రానున్నాయి. ఈ మేరకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్ నుంచి అయోధ్యకు డైరెక్టుగా విమాన సర్వీసు ప్రారంభించాలని కోరుతూ.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ఫిబ్రవరి 26న లేఖ రాసినట్టు తెలిపారు. తన విజ్ఞప్తిపై స్పందించిన సింధియా.. వాణిజ్య విమానయాన సంస్థలతో మాట్లాడినట్లు వివరించారు. దీంతో.. ఏప్రిల్ 2 నుంచి వారానికి 3 రోజులు అంటే.. మంగళవారం, గురువారం, శనివారం రోజుల్లో అయోధ్యకు విమాన సేవలు అందుబాటు లోకి రానున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సర్వీసులతో.. రాములోరి భక్తులు అయోధ్యకు ఇక నుంచి సులభంగా వెళ్లే అవకాశం ఉంది. అయితే.. అయోధ్యలో రామమందిరం ప్రారంభా నికి ముందే.. అత్యాధునిక వసతులతో అంత ర్జాతీయ ఎయిర్ పోర్ట్ ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం. దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంతో పాటు పర్యటక ప్రదేశంగా మార్చేందుకు కేంద్రం ప్రయత్నించ గా.. ఈ మేరకు ఆయా రాష్ట్రాల నుంచి డైరెక్టుగా అయోధ్యకు విమాన సర్వీసులను క్రమంగా ప్రారంభిస్తూ వస్తోంది. ఈ క్రమం లోనే.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి అయోధ్యకు డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులను ప్రాంభించ నుంది. మరోవైపు.. అయోధ్య రామ మందిరం ప్రారంభమైనప్పటి నుంచి.. తెలంగాణలోని రాములోరి భక్తుల కోసం బీజేపీ నాయకులు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 119 నియోజకవర్గాల్లోని భక్తులను రాములోరి సన్నిధా నానికి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేశారు. ఇందు కోసం దక్షిణ మధ్య రైల్వేతో మాట్లాడి.. ప్రత్యేక సర్వీసులను సొంత ఖర్చులతో ఏర్పాటు చేయ టం గమనార్హం. అయితే.. ఇప్పుడు మిగతా ప్రయాణికులను దృష్టిలో పెట్టుకున్న కేంద్రం ప్రత్యేక విమాన సర్వీసులను ప్రారంభించటం విశేషం.

# న్యాయవాద సమస్యల పరిష్కారానికి కృషి.

**బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.జగన్మోహన్ గౌడ్.**








**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్1:**

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్ తెలిపారు. నూతన అధ్యక్షులుగా సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం జిల్లా కోర్టులోని డిఎల్ఎస్ఎ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ, నిజామాబాద్ బార్ లో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం చేయడం, జూనియర్ న్యాయవాదులకు సహకారాన్ని అందించడం, సెమినార్ నిర్వహించడం తోపాటు అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి కుంచాల సునీత ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

నూతన కమిటీ బార్ అండ్ బెంచ్ సహకార%శీ%తో ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఎన్నికల అధికారి ఆముదాల సుదర్శన్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయమూర్తులు, కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఉపాధ్యక్షులు పి. రాజు, జాయింట్ సెక్రెటరీ సురేష్, కోశాధికారి దీపక్, గ్రంథాలయ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్,మహిళ ప్రతినిధి కవిత రెడ్డి కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, రాజలింగం, కృపాకర్ రెడ్డి,ఆజార్ కిషన్ రావు, పి వెంకటేష్, విగ్నేష్, బట్టు మాణిక్ రాజ్, బి రవి, నీరజ రెడ్డి, అరటి నారాయణ, శివాజీ, రజిత, సీనియర్, జూనియర్ మహిళ న్యావదులు పాల్గొన్నారు.

# అవకాశం ఇస్తే ఎంపీగా పోటీకి సిద్ధం..



లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. తెలంగాణలో రాజకీయ హడావుడి నెలకొంది. ఇప్పటికే పలు పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. అయితే.. అధికార పార్టీ మాత్రం ఇంకా కొన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మరోవైపు.. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నుంచి ప్రకటించిన అభ్యర్థులు కూడా ఝలక్ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే.. తన మనసులో మాట బయటపెట్టారు పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య. తాను ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమని కీలక ప్రకటన చేశారు. అవకాశం ఇస్తే వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య కీలక ప్రకటన చేశారు. ఏ పార్టీ అవకాశం కల్పించినా తాను సిద్ధమేనని రాజకీయ పార్టీలకు తెలిపారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గడ్డం సమ్మయ్య.. జనవరి 26 గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో.. ఆయన జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా మొదటిసారి జనగామలో ప్రెస్మీట్ పెట్టిన గడ్డం సమయ్య.. రాజకీయ ప్రవేశంపై తన మనసులో మాటను బయట పెట్టారు.

చిందు యక్షగాన కళాకారుడిగా దేశవ్యాప్తంగా సుమారు 20 వేల ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ఎన్నో ప్రదర్శనలు ఇచ్చానని, తాను ప్రజాప్రతినిధిగా మారితే ప్రత్యక్షంగా సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గానికి చెందిన తనను గుర్తించి ఏదైనా పార్టీ టికెట్ ఇస్తే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఎస్సీ ఉప కులానికి చెందిన తమకు ఏ రాజకీయ పార్టీ ప్రాధాన్యం ఇచ్చినా గౌరవిస్తామన్నారు. అక్షరాస్యత, పరిసరాల పరిశుభ్రత, మద్యపాన నిషేదం, కుటుంబ నియంత్రణ కోసం తన కళ ద్వారా ప్రజల్లో ఎంతో చైతన్యం తీసుకువచ్చానని, ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వస్తే మరింత సేవ చేయగలనని గడ్డం సమ్మయ్య చెప్పుకొచ్చారు. తన లాంటి కళాకారులను చట్టసభల్లోకి పంపేందుకు రాజకీయ పార్టీలు చొరవ చూపాలని కోరారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు జరుగ నున్నందున.. ఏదైనా నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఆలోచన చేస్తున్నట్లు గడ్డం సమ్మయ్య స్పష్టం చేశారు.

# కొడుకును హత్య చేయించిన తల్లి.. ఏడు పెళ్లిళ్లు చేసుకొని అందర్నీ..!

నిజామాబాద్ జిల్లా లింగంపేట మండలం పోల్కంపేటలో దారుణం చోటు చేసుకుంది. కన్నతల్లే కుమారుడిని హత్య చేయించింది. ఏడు పెళ్లిళ్లు చేసుకొని అందర్నీ వదిలేయటంతో పాటు.. డబ్బు కోసం ఇబ్బందులకు గురి చేయటంతో అడ్డు తొలగించుకుంది. ఏడు పెళ్లిళ్లు చేసుకొని అందర్నీ వదిలేశాడు. తాగుడు బానిసై.. ఆస్తిని అమ్మకానికి పెట్టాడు. తల్లిని నిత్యం వేధింపులకు గురిచేస్తూ ఇబ్బందులు పెట్టసాగాడు. భరించలేకపోయిన తల్లి తన కొడుకు అడ్డు తొలగించుకోవాలని భావించింది. బంధువుల సాయంతో గొంతు నులిమి హత్య చేయించింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా లింగంపేట మండలం పోల్కంపేటకు చెందిన కదాల సాయిలు ఈ నెల 25న సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులోని పెద్దచెరువు వద్ద హత్యకు గురయ్యాడు. కేసు నమోదు చేసిన సదాశివనగర్ పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి తల్లి లచ్చవ్వపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటకొచ్చింది. రోడ్డు మీద మహిళ రీల్స్ గొలుసు లాక్కెల్లిన దొంగ జల్సాలకు అలవాటు పడిన సాయిలు ఏడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. అనంతరం అందరినీ వదిలేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తమకున్న భూమిని కొంచెం కొంచెంగా విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. డబ్బుల కోసం తల్లిని హింసించేవాడు. దీంతో కొడుకు అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది లచ్చవ్వ. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం నాగేపూర్‌కు చెందిన తన మనవడు బసకొండ దేవ్‌కు విషయం చెప్పింది. దేవ్ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లింగాపూర్‌కు చెందిన స్నేహితుడు కోట మారుతి సాయం తీసుకున్నాడు. ముందస్తు పథకం ప్రకారం సాయిలును అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు వద్దకు తీసుకొొచ్చి మద్యం తాగించారు. పీలకదాకా తాగి సాయిలు స్పృహ తప్పడంతో ఇద్దరు కలిసి కర్చీఫ్ సాయంతో మెడకు గట్టిగా బిగించి చంపేసి అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టి నిందితులను పట్టుకున్నారు. బసకొండ దేవ్, కోట మారుతి, కదాల లచ్చవ్వను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

# పెరిగిన టోల్ ఛార్జీలు

దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల్లో ఛార్జీల పెంపు అమల్లోకి వచ్చింది. ఏడాదికి ఒకసారి ఏప్రిల్ 1న టోల్ రుసుం పెరుగుతుంది. రోడ్ల నిర్వహణకు ఛార్జీల పెంపును ఆనవాయితీగా తీసుకున్న జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ).. ఈసారి కూడా కొత్త ఛార్జీలను సిద్ధం చేసింది. గతేడాది వివిధ కేటగిరీల వాహనాలకు సంబంధించి 8 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచగా.. ఈసారి వాహనదారులపై కాస్త దయతలిచి 5.50 శాతంలోపే పెంపును పరిమితం చేసింది. హైదరాబాద్-విజయవాడ (65) జాతీయ రహదారిని ఉదాహరణగా తీసుకుంటే.. ఈ హైవేపై తెలంగాణలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలో చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒక వైపు ప్రయాణానికి రూ.5, రానూపోనూ కలిపి రూ.10, తేలికపాటి వాణిజ్య వాహనాలు ఒక వైపు రూ.10, ఇరు వైపులా అయితే రూ.20, అదే విధంగా బస్సు, ట్రక్కులకు రూ.25, రూ.35, భారీ రవాణా వాహనాలకు రూ.35, రూ.50 చొప్పున పెంచారు. 24 గంటల లోపు తిరుగు ప్రయాణం చేస్తే అన్ని రకాల వాహనాలకు రుసుంలో 25 శాతం మినహాయింపు లభిస్తుంది. స్థానికుల నెలవారీ పాస్‌ను కూడా పెంచారు. ఆ పాసులను



రూ.330 నుంచి 340కి పెంచారు. విజయ వాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్ ప్లాజా మీదుగా రోజుకు సుమారు 40 వేల వరకు ప్రస్తుతం వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వారాంతపు దినాల్లో, శుభకార్యాలు అధికంగా ఉన్నప్పుడు మరో 5 వేల వాహనాలు అదనంగా వెళతాయని అధికారులు తెలిపారు. పెరిగిన టోల్ ధరలతో సామాన్యులపై భారం పడనుంది. 2025 మార్చి 31 వరకు పెరిగిన ధరలు అమలులో ఉండనున్నాయి. గతంలో టోల్‌గేట్ల వద్ద నిర్వాహకులు భారీగా అక్రమాలకు పాల్పడటంతో.. వాహనాల నుంచి వసూలు చేసిన మొత్తంలో దాదాపు 25 శాతం పక్కదారి పట్టేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు చేరే మొత్తం తక్కువగా కనిపించేది. ఫాస్టాగ్ అమల్లోకి వచ్చాక అక్రమాలకు తెరపడి, ప్రతి రూపాయి పక్కాగా లెక్కలోకి వస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపులు..



ఓ ప్రధాన పార్టీ తరఫున పోలీసు వాహనాల్లో పెద్దఎత్తున నిధులు తరలించినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యం లోనే త్వరలోనే కొందరు రాజకీయ ప్రముఖులకు పోలీసులు నోటీసులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మొన్నటి వరకు ప్రతిపక్ష నేతలు, వారి బంధువులు, కొందరు వ్యాపారుల ఫోన్లు మాత్రమే ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు రాగా.. ఈ కేసులో నిందితులను విచారించగా మరికొన్ని విషయాలు బయటపడుతున్నాయి. టాస్క్‌ఫోర్స్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎన్నికల సమయంలో స్వయంగా పోలీసు వాహనాల్లోనే ఓ ప్రధాన పార్టీకి చెందిన డబ్బులు తరలించినట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ వాహనాలయితే తనిఖీలు చేపట్టరనే ఉద్దేశ్యంతో కొందరు కీలక నేతలకు చెందిన డబ్బును తరలించినట్లు సమాచారం. ఇందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడ్డ అభ్యర్థులతోపాటు గెలిచిన ఎమ్మెల్యేలు కూడా ఉండవచ్చునని తెలిసింది. త్వరలోనే కొందరు రాజకీయ ప్రముఖులకు పోలీసులు నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని.. ఇందులో మాజీ మంత్రులు కూడా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక ఈ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుతో పాటు అనదపు ఎస్పీలు భుజంగ రావు, తిరుపతన్నలను తొలుత అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మాజీ డీసీపీ రాధా కిషన్ రావును కూడా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. రాధా కిషన్ రావును విచారించేందుకు పోలీసులు నాంపల్లి న్యాయస్థానంలో కస్టడీ పిటిషన్ దాఖలు చేయగా.. నేడు మధ్యాహ్నం విచారణకు రానుంది. ఆయన్ను కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు తెలిసే ఛాన్స్ ఉంది. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఇవాళ ఆయన హైదరాబాద్ చేరుకుంటారనే ప్రచారం జరుగుతుంది. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు తాను ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఇది వరకే ప్రభాకర్ రావు ఓ పోలీసు ఉన్నతాధికారితో చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన్ను అదుపులోకి తీసుకుంటే ఈ కేసులో అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఈకేసులో తెరపైకి మరో కొత్త పేరు వచ్చింది. సుదీర్ఘ కాలం ఎస్ఐబీలో పని చేసి దయానంద్ రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ప్రభాకర్ రావుతో ఆయనకు సన్నిహిత్యం ఉన్నట్లు తెలిసింది. ఈ కేసులో ఆయన పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.